సీఎం జగన్ పాలనలో అర్హులందరికీ పథకాలు

- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- 3,201 మందికి ఇళ్ల రిజిస్ట్రేషన్ పట్టాల పంపిణీ


సభకు హాజరైన లబ్ధిదారులు


రిజిస్ట్రేషన్ చేసిన ఇళ్ల పట్టాలు లబ్ధిదారులకు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

ఆనందపురం : రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం అయితేనే అర్హులందరికీ పథకాలు కొనసాగుతాయని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని శొంఠ్యాంలో బుధవారం వైఎస్సార్ జగనన్న ఇళ్ల పట్టా హక్కు పత్రాలను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోట్లాది రూపాయలతో అమలు జరుపుతున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చేరుతున్నాయో..? లేదో..? తెలుసుకోవడానికి సీఎం జగన్ మోహన్‌రెడ్డి 'గడప గడపకు మన ప్రభుత్వం' అనే వినూత్న కార్యక్రమాన్ని రూపొందించారన్నారు. దీనివల్ల చాలా ఏళ్లుగా పరిష్కారం కాకుండా ఉన్న ఎన్నో సమస్యలు పరిష్కరించగలిగామన్నారు. భీమిలి నియోజకవర్గంలో వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు రూ.2750 కోట్లు ఖర్చు చేశామన్నారు. ఆనందపురం మండలంలో రూ.481కోట్లు ఖర్చు చేశామని వివరించారు. అదంతా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చలువేనని చెప్పారు. ఇదంతా ఓట్లు కోసం కాదని, కేవలం అట్టడుగున ఉన్న పేదలను ఆదుకోవడానికేనని చెప్పారు. కొంత మంది ఓట్లు వేయకపోయినా పార్టీలకతీతంగా పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టకుండా కొన్ని చోట్ల టీడీపీ నాయకులు కోర్టుకు వెళ్లి ఆటంకాలు సృష్టిస్తున్నారని, అలాంటి వారికి ప్రజలు గుణపాఠం చెప్పాలని కోరారు. మహిళలకు డ్వాక్రా రుణమాఫీ అని చంద్రబాబు నాయుడు మోసం చేశారని, కేవలం అధికారం కోసం పాకులాడుతున్న అలాంటి వారిని తిరస్కరించాలని సూచించారు. మారుమూలన ఉన్న శొంఠ్యాం పంచాయతీలో వివిధ పథకాలకు రూ.50 కోట్లు వ్యయం చేశామని తెలిపారు. ఇక్కడ రూ.2 కోట్లతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నిర్మిస్తున్నామన్నారు. రోడ్డు నిర్మాణంతోపాటు మంచినీటి పథకాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 3,201 మందికి రిజిస్ట్రేషన్ చేసిన ఇళ్ల పట్టాలను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎస్.హేమంత్ కుమార్, ఎంపీడీవో ఎస్ అప్పలనాయుడు, జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం, వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, వైస్ ఎంపీపీ పాండ్రంకి శ్రీను, భీమిలి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బోని అప్పలనాయుడు, నాయకులు లెంక రాంబాబు, కోరాడ వెంకట రమణారావు, డోల దేవుడు, కోరాడ అప్పలస్వామి నాయుడు, బీఆర్‌బీ నాయుడు, గంధ్రెడ్డి శ్రీను, కోరాడ ముసలినాయుడు, పిన్నింటి వెంకటరమణ, షిణగం అప్పలరాజు, కలిమి గంగరాజు, కర్రి నాయుడు బాబు, రౌతు శ్రీను, గొలగాని కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

20 రోజుల్లోనే అందుబాటులోకి హైవే సర్వీసు రోడ్డు

- రూ.30 లక్షలతో చురుగ్గా నిర్మాణం
- జీవీఎంసీ 5వ వార్డు ప్రజల హర్షం


కొమ్మాది జంక్షన్ సమీపంలో అందుబాటులోకి వచ్చిన సర్వీసు రోడ్డు

మధురవాడ: శంకుస్థాపన చేసిన తర్వాత 20 రోజుల్లోనే మధురవాడలో ఓ రోడ్డు నిర్మాణం పూర్తై అందుబాటులోకి రావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ 5వ వార్డు కొమ్మాది జంక్షన్ వద్ద గల పెట్రోలు బంక్ నుంచి బీఎస్ఎన్ఎల్ ఆఫీసు మీదుగా వైఎస్సార్ కాలనీ వద్ద గల శ్రీచైతన్య టెక్నో స్కూలు వరకు హైవేని ఆనుకుని హాట్ మిక్స్ సర్వీసు రోడ్డు నిర్మాణానికి రూ.30 లక్షలతో 20 రోజుల కిందట ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత ఏఈ సురేష్ ఆధ్వర్యంలో పనులు ప్రారంభించి చురుగ్గా పూర్తి చేశారు. ఇక్కడి ప్రజలు, వాహనదారులు పడుతున్న ఇబ్బందులను వైఎస్సార్‌సీపీ 5వ వార్డు అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతురావు ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లడంతో ఆయన నిధులు మంజూరు చేయించారు. అనంతరం ప్రత్యేకంగా దృష్టి సారించి రోడ్డు నిర్మాణం కూడా త్వరగా పూర్తి చేయించడంతో స్థానికులు, వాహనదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా హైవేలో ఒన్‌వే రాకపోకలతో ఇబ్బంది పడుతున్న పలు కాలనీల ప్రజలు, బీఎస్ఎన్ఎల్‌తోపాటు పలు సంస్థల విజిటర్స్, పాఠశాలల పిల్లలు, వైఎస్సార్ కాలనీ, డ్రైవర్స్ కాలనీల నివాసుల ఇబ్బందులు తొలగిపోయాయి. వారంతా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారు.

పేదలకు, పెత్తందారులకు మధ్య ఎన్నికల యుద్ధం

- పోలింగ్ బూత్ ఏజెంట్లు బాధ్యతగా పని చేయాలి
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు


అనంతవరంలో ఎన్నికల యుద్ధానికి సిద్ధమంటున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు

పద్మనాభం: రాబోయే ఎన్నికలు పేదలకు, పెత్తందారులకు మధ్య జరిగే యుద్ధమని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. పద్మనాభం మండలం అనంతవరంలో బుధవారం సాయంత్రం నిర్వహించిన పోలింగ్ బూత్ ఏజెంట్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. గత నాలుగున్నరేళ్లలో భీమిలి నియోజకవర్గంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి పనులను ఎల్ఈడీ స్క్రీన్‌పై ఆయన వివరించారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాన్ని తెలియజేశారు. కుల మతాలకు తావులేకుండా, పార్టీ రహితంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించామని, ఈ విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. వలంటీర్ వ్యవస్థ ద్వారా పారదర్శకంగా పథకాలు అందించామన్నారు. జగనన్నను గెలిపించుకోకపోతే ఇప్పుడున్న పథకాలు ఆగిపోయే పరిస్థితి వస్తుందనే విషయాన్ని ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. సీఎం జగనన్న అందించే సుపరిపాలన కావాలంటే ఫ్యాన్ గుర్తుపై ఓటేసి భీమిలిలో వైఎస్సార్‌సీపీని గెలిపించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఉత్తరాంధ్ర యూత్ విభాగం కో ఆర్డినేటర్ ముత్తంశెట్టి శివనందీష్, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, నాయకులు సుంకర బంగారప్పడు, సిరుగుడి ఆదినారాయణ, అముజూరి అప్పారావు, మొకర అప్పలనాయుడు, మరగడ అప్పారావు, కె.శ్రీనివాసరావు, మజ్జి శంకర్, బేపల గురినాయుడు, తాలాడ నరసింహనాయుడు, ఈర్ల ఈశ్వరరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఘనంగా త్యాగరాజ ఆరాధనోత్సవం


గానం చేస్తున్న ముట్నూరి జయలక్ష్మి

కొమ్మాది: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ హ్యుమానిటీస్ అండ్ సోషల్ సైన్సెస్‌కు అనుబంధంగా గల డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైన్ అండ్ పెర్ఫార్మింగ్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో త్యాగరాజ ఆరాధనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. కర్నాటక సంగీత విద్వాంసురాలు, సంగీత కళా సాగర అవార్డు గ్రహీత ముట్నూరి జయలక్ష్మి ఉత్సవాలను ప్రారంభించారు. సంగీతం, నృత్యం వంటి లలిత కళల్లో భారతీయ సంస్కృతి సాంప్రదాయాలు అంతర్లీనంగా ప్రవహిస్తున్నాయన్నారు. యువత లలిత కళలు నేర్చుకోవడం వల్ల జీవితాన్ని ఉన్నతంగా మలచుకోవచ్చన్నారు. సంగీతం ద్వారా గణిత శాస్త్రంపై పట్టు లభిస్తుందని పేర్కొన్నారు.

మానసిక బలంతో ఉన్నతస్థితి

కొమ్మాది: మహిళలు మానసికంగా బలంగా ఉన్నప్పుడే ఎలాంటి అవరోధాలైనా ఎదుర్కొని జీవితంలో ముందుకు సాగడానికి మార్గం ఏర్పడుతుందని గీతం అధ్యక్షుడు ఎం.శ్రీ భరత్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని గీతం వర్సిటీలో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా అధ్యాపకులు, విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. శారీరక దృఢత్వం మినహా పురుషుల కంటే మహిళలు అన్ని రంగాల్లో పైస్థాయిలో ఉన్నారన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

తగరపువలస: భీమిలి మండలంలో ఖాళీగా ఉన్న ఏడు గ్రామ వలంటీర్ పోస్టులకు అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్టు ఎంపీడీవో జానకి తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులై ఈ నెల 7వ తేదీ నాటికి 18 నుంచి 35 ఏళ్ల మధ్య వయసున్న వారు అర్హులన్నారు. ఈ నెల 8, 9వ తేదీల్లో విద్యార్హత, కులం, నివాస ధ్రువీకరణపత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలని సూచించారు. పెదనాగమయ్యపాలెం - 4, అమనాం - 1, చేపలుప్పాడ - 1, తాటితూరు - 1 ఖాళీగా ఉన్నట్టు ఆమె తెలిపారు.

భీమిలి పోలీస్ స్టేషన్‌లో పదో తరగతి ప్రశ్నపత్రాలు


పోలీస్ స్టేసన్ ఆవరణలో ప్రశ్నపత్రాలు వేరు చేస్తున్న సిబ్బంది

తగరపువలస : ఈ నెల 18 నుంచి జరగనున్న పదో తరగతి పరీక్షలకు సంబంధించి సెట్ - 1 ప్రశ్నాపత్రాలు బుధవారం భీమిలి పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నాయి. భీమిలి పరిధిలోని 12 పరీక్షా కేంద్రాలకు వీటిని కేంద్ర నిర్వాహకులు ఎంఈవో శివరాణి ఆధ్వర్యంలో వేరు చేసి భద్రపరిచారు. సెట్ - 2 ప్రశ్నాపత్రాలు గురువారం రానున్నాయి.

ఎంపీపీ పాఠశాల పరిశీలన


పాఠశాల వద్ద జాతీయ పరిశోధన శిక్షణ సంస్థ ప్రతినిధులు

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు రుషికొండలో ఎంపీపీ పాఠశాలను బుధవారం సాయంత్రం న్యూఢిల్లీకి చెందిన జాతీయ పరిశోధన శిక్షణ సంస్థ ప్రతినిధుల బృందం సందర్శించింది. ఈ సందర్భంగా ప్రతినిధులు డాక్టర్ అనూప్ కుమార్, వినోద్ విద్యార్థుల అభ్యసన స్థాయిని పరిశీలించారు. అనంతరం ఇదే ప్రాంతంలో గల అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. మధ్యాహ్న భోజనం చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఏఎంవో లక్ష్మి, ఎంఈవో అనురాధ, పాఠశాల ప్రిన్సిపల్ పుణ్యవతి పాల్గొన్నారు.

భూ వివాదాల పరిష్కారానికి చర్యలు


భీమిలి పోలీస్ స్టేషన్‌లో బాధితుల నుంచి వినతులు స్వీకరిస్తున్న డీసీపీ - 1 మణికంఠ

తగరపువలస : భీమిలి పోలీస్ స్టేషన్ పరిధిలో భూ తగాదాలు, కబ్జాలపై బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఇందులో భాగంగా డీసీపీ - 1 సీహెచ్‌వీఎస్ మణికంఠ భీమిలి పోలీస్ స్టేషన్‌లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 24 మంది బాధితుల నుంచి వినతులు స్వీకరించారు. వీటిలో ఎక్కువగా 1999 - 2000 మధ్యలో జరిగిన లావాదేవీలకు సంబంధించినవిగా గుర్తించామని ఆయన తెలిపారు. ఒకరికి విక్రయించినవి మరొకరికి విక్రయించడం, తదితర లోపాలు ఉన్నట్టు గుర్తించామన్నారు. వివిధ విభాగాల అధికారులతో వీటిపై చర్చించి రెండు వారాల్లో సమస్యలు పరిష్కరిస్తామని పేర్కొన్నారు.


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న నగర ఏసీపీ ఫకీరప్ప

భూ కబ్జాలపై 14 ఫిర్యాదుల స్వీకరణ

పీఎం పాలెం : భూ కబ్జాలకు పాల్పడిన వారిని చట్టపరంగా శిక్షిస్తామని నగర ఏసీపీ ఫకీరప్ప అన్నారు. భూ కబ్జాలకు సంబంధించి నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ ఆదేశాల మేరకు పీఎం పాలెం పోలీస్ స్టేషనల్‌లో బుధవారం ఆయన ఫిర్యాదులు స్వీకరించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ మధురవాడ, పీఎం పాలెంలో భూకబ్జాలకు పాల్పడడం కొంత మందికి వృత్తిగా మారిపోయిందన్నారు. ఆక్రమణ, కబ్జాకు పాల్పడినట్టు తేలితే వారిపై ఛార్జిషీట్ నమోదు చేస్తామన్నారు. ఆయన 14 మంది నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. రెండు వారాల్లో ఫిర్యాదులు పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

మధురవాడ: జీవీఎంసీ 6వ వార్డు లక్ష్మివానిపాలెంకి చెందిన ఉప్పాడ గురుమూర్తి కుమారుడు ప్రవీణకుమార్ (15)కి ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేశారు. కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న బాలునికి లక్ష రూపాయలు మొత్తాన్ని బుధవారం విశాఖలోని ఆయన నివాసంలో అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు బొట్ట అప్పలరాజు, నాయకులు శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

స్వామి వివేకానంద విగ్రహం పునఃప్రతిష్ట



తాతా థియేటర్ కూడలిలో ప్రతిష్ఠించిన వివేకానందుని విగ్రహం

తగరపువలస : స్థానిక తాతా థియేటర్ కూడలిలో ఈ నెల 3న గుర్తు తెలియని వ్యక్తుల చేష్టలతో తెగిపడిన స్వామి వివేకానందుని విగ్రహాన్ని ఆయన అభిమానులు బుధవారం తిరిగి ప్రతిష్ఠించారు. 'తెగిపడిన స్వామి వివేకానందుని విగ్రహం' శీర్షికతో ఈ నెల 4న సాక్షిలో వార్త ప్రచురించిన సంగతి తెలిసిందే. దీనిపై వివేకానంద యూత్ అసోసియేషన్ ప్రతినిధులు తమ్మిన శ్రీను, జోగ రామకృష్ణ, చెన్నా అప్పలరాజు తదితరులు స్పందించి విగ్రహాన్ని పునరుద్ధరించారు. వీరి ప్రయత్నాన్ని పలువురు అభినందించారు.

విద్యుదాఘాతంతో కార్మికుడి మృతి


ప్రమాద స్థలంలో ఆనందరావుకు సపర్యలు చేస్తున్న తోటి కార్మికులు

ఆనందపురం : మండలంలోని మామిడిలోవలో బుధవారం విద్యుత్ లైన్లు మరమ్మతులు చేస్తుండగా విద్యుదాఘాతానికి గురై ఓ కార్మికుడు మృతి చెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని చందక గ్రామానికి చెందిన రెడ్డి ఆనందరావు (40) విద్యుత్ కాంట్రాక్టరు వద్ద రోజు వారీ కార్మికుడిగా పని చేస్తున్నాడు. మామిడిలోవలో వేలాడుతున్న విద్యుత్ లైన్లు బుధవారం సరిచేస్తూ ఇన్‌లైన్ పోర్ వర్క్ చేస్తున్నారు. అక్కడ లైనులో గల విద్యుత్ స్తంభాలకు పైన హెచ్‌టీ లైను, దానికి సుమారు మూడు అడుగుల దూరంలో అవే స్తంభాలకు మరో ఎల్‌టీ లైను ఉంది. అక్కడ పనులు చేపట్టే నిమిత్తం స్తంభాలకు కిందవైపు గల ఎల్‌టీ లైనుకు విద్యుత్ సరఫరా నిలిపి వేశారు. కాగా పనిలోకి వెళ్లిన ఆనందరావు విద్యుత్ స్తంభం ఎక్కి ఎల్‌టీ లైను విద్యుత్ వైర్లను సరిచేస్తున్నాడు. ఆ క్రమంలో అదే స్తంభానికి పైన ఉన్న హెచ్‌టీ లైను వైర్లకు కింది లైను వైర్లు తగిలాయి. దీంతో విద్యుత్ షాక్‌కు గురైన ఆనందరావు స్తంభం పైనుంచి కింద ఉన్న హోర్డింగ్‌పై పడి గాయాలతో నేలపై పడిపోయాడు. గమనించిన తోటి కార్మికులు వెంటనే ఆనందరావుకు సపర్యలు చేసినా ఫలితం లేకపోవడంతో మెరుగైన వైద్యం కోసం నగరంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. మృతుని భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు ఆనందపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా విద్యుత్ లైన్లలో పని చేసేటప్పుడు స్తంభాలపై గల రెండు లైన్ల సరఫరాను నిలిపివేసి ఉంటే ప్రమాదం జరిగేది కాదని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

అందరి ఆరోగ్యమే సీఎం జగన్ లక్ష్యం


మజ్జివలస సచివాలయంలో వైద్య పరీక్షలు చేస్తున్న శోభారాణి


కేస్ షీట్లు, మందులు పంపిణీ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది, సర్పంచ్ ఆదిలక్ష్మి, తదితరులు

తగరపువలస : రాష్ట్రంలో ప్రతి ఒక్కరి ఆరోగ్యమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని భీమిలి మండలం మజ్జివలస పంచాయతీ సర్పంచ్ తుపాకుల ఆదిలక్ష్మి అన్నారు. స్థానిక గ్రామ సచివాలయంలో బుధవారం నిర్వహించిన రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ఆమె మాట్లాడారు. గత ప్రభుత్వాల పాలనలో ప్రభుత్వ ఆస్పత్రులు అందుబాటులో లేక ప్రజలు ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయించి ఇల్లు, ఒళ్లు గుల్ల చేసుకునేవారన్నారు. ప్రమాదకరమైన వ్యాధులకు చికిత్స చేయించుకోలేని పేదవారు తమ ప్రాణాలు ఫణంగా పెట్టేవారన్నారు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.25 లక్షల వరకు ఉచితంగా ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్సలు అందిస్తోందన్నారు. గ్రామంలోనే సాధారణ, స్పెషలిస్ట్ వైద్యుల ద్వారా అన్నిరకాల వ్యాధులకు చికిత్స అందిస్తున్నట్టు తెలిపారు. తాళ్లవలస పీహెచ్‌సీ వైద్యుడు ఏబీ మల్లికార్జునరావు మాట్లాడుతూ 455 మందికి తనతోపాటు మరో నలుగురు వైద్యులు శోభారాణి, అనుదీప్, చైతన్య, సత్యనారాయణ సేవలు అందించారన్నారు. నలుగురిని మెరుగైన చికిత్స కోసం రిఫరల్ ఆస్పత్రులకు సిఫారసు చేశామన్నారు. కార్యక్రమంలో తుపాకుల అప్పలరాజు, ఆరోగ్య సిబ్బంది డి.గౌరి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణం


సత్యనారాయణ స్వామి కొండపై ఆలయంలో కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

తగరపువలస : మాఘమాసం మతత్రయ ఏకాదశి సందర్భంగా స్థానిక శ్రీరమా సత్యనారాయణ స్వామి కొండపై గల శివాలయంలో బుధవారం పార్వతీ పరమేశ్వరులకు అర్చకులు ఘనంగా కల్యాణం జరిపించారు. ప్రధాన అర్చకుడు ఏడిద వివేకానందశర్మ ఆధ్వర్యంలో అర్చకులు ఏడిద కార్తీకశర్మ, నారాయణాచార్యులు, దేవరకొండ శ్రీనివాసశర్మ వేడుకలు జరిపించగా 30 మంది జంటలు వేడుకలలో పాల్గొని కల్యాణం జరిపించారు. అనంతరం ఆది దంపతులకు పల్లకీ సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో భారీ అన్నసమారాధన చేపట్టారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని కల్యాణ వేడుకలు తిలకించారు.

అనంతుని కల్యాణోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ముత్తంశెట్టి మహేష్, గిరిబాబు, రాంబాబు, నాయకులు

పద్మనాభం : పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో ఈ నెల 20 నుంచి 26 వరకు నిర్వహించనున్న అనంత పద్మనాభ స్వామి కల్యాణోత్సవాల వాల్ పోస్టర్‌ను వైఎస్సార్ సీపీ భీమునిపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్ బుధవారం కుంతీ మాధవ స్వామి ఆలయంలో ఆవిష్కరించారు. 20న పుట్ట బంగారం తీసుకురావడంతో కల్యాణోత్సవాలకు అంకురార్పన జరుగుతుంది. 21న శ్రీదేవి భూదేవి సమేత అనంతుని ఉత్సవ విగ్రహాలకు కల్యాణం నిర్వహిస్తారు. 23న అనంతుని పుష్కరిణిలో తెప్పోత్సవం, 24న రథోత్సవం, 26న శ్రీ పుష్పయాగంతో కల్యాణోత్సవాలు ముగుస్తాయి. వీటికి సంబంధించిన పోస్టర్‌ను మహేష్, తదితరులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, తాలాడ పద్మనాభం, బుగత సత్యనారాయణ, సుంకర నారాయణరావు, తాలాడ పైడిరాజు, కాళ్ల నగేష్ కుమార్, కంటుబోతు ఎర్నాయుడు పాల్గొన్నారు.


అనంతుని పుష్కరిణి పరిశీలన

అనంతుని కల్యాణోత్సవాల్లో భాగంగా ఈ నెల 23న నిర్వహించనున్న తెప్పోత్సవానికి సంబంధించి పుష్కరిణిని ముత్తంశెట్టి మహేష్, తదితరులు బుధవారం పరిశీలించారు. ఆయనవెంట జెడ్పీ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు ఉన్నారు.

పాడి రైతులకు దుప్పట్లు పంపిణీ

ఆనందపురం : మండలంలోని బోని గ్రామంలోని పాడి రైతులకు బుధవారం దుప్పట్లు పంపిణీ చేశారు. విశాఖ డైయిరీ పాల ఉత్పత్తిదారుల సంఘానికి చెందిన 75 మంది రైతులకు సూపర్ వైజర్ మహేష్ వీటిని అందజేశారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు బోని నారాయణ స్వామి, వేతన కార్యదర్శి బోని అప్పలరాజు, రైతులు పాల్గొన్నారు.

ప్రాథమిక పాఠశాలను సందర్శించిన కేంద్ర బృందం


తాటితూరు మండల ప్రాథమిక పాఠశాల వద్ద కేంద్ర బృందం

తగరపువలస : భీమిలి మండలం తాటితూరు మండల ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను ఎన్‌సీఈఆర్‌టీ బృందం ఎర్లీ చైల్డ్‌హుడ్ కేర్ అండ్ ఎడ్యుకేషన్, జాతీయ విద్యా విధానం తదితర 20కుపైగా విధానాలపై బుధవారం సర్వే చేశారు. వసతులు, భద్రత, మధ్యాహ్న భోజనం, విద్యార్థుల ప్రగతి, వారి రక్షణ కోసం తీసుకుంటున్న చర్యలు, మౌలిక సదుపాయాలు, టాయిలెట్ల నిర్వహణ, అకడమిక్ అంశాలకు సంబంధించి అంగన్‌వాడీ చిన్నారులు, 1, 2 తరగతుల విద్యార్థుల తల్లిదండ్రులతో ముఖాముఖి మాట్లాడారు. పాఠశాలలో తీసుకుంటున్న జాగ్రత్తలపై పరిశీలించారు. కార్యక్రమంలో ఈసీసీఈ రాష్ట్ర కో ఆర్డినేటర్ దిలీప్ వర్మ, ఎన్‌సీఈఆర్‌టీ ప్రొఫెసర్ డాక్టర్ శిల్పా మనోజ్ఞ, భీమిలి డైట్ అధ్యాపకుడు సోమయాజులు, ఎంఈవో - 2 జయప్రద, ప్రధానోపాధ్యాయుడు కె.సన్యాసినాయుడు, ఉపాధ్యాయుడు పోతురాజు, సీఆర్పీ అనంతలక్ష్మి, ఛాత్రోపాధ్యాయులు, అంగన్‌వాడీ నిర్వాహకురాలు పార్వతి తదితరులు పాల్గొన్నారు.

ఇష్టారాజ్యంగా డ్రైనేజీల మూసివేత


మట్టితో నిండిపోయిన డ్రైనేజీ

కొమ్మాది : జీవీఎంసీ 4వ వార్డు కె.నగరపాలెం నుంచి కాపులుప్పాడ వరకు నిర్మించిన డ్రైనేజీలను మట్టితో కప్పివేయడంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కె.నగరపాలెంలో ఓ వ్యక్తి తన స్థలంలో నింపేందుకు లారీలతో మట్టి రప్పించాడు. అయితే ఆ మట్టితో స్థలంతోపాటు డ్రైనేజీని కూడా కప్పి వేయడంతో మురుగునీరు నిలిచిపోయింది. అదేవిధంగా ఇదే ప్రాంతంలో డ్రైనేజీలపై ఓ మహిళ ఏకంగా నిర్మాణం చేపట్టింది. సోమన్నపాలెంలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. టౌన్‌ప్లానింగ్ సిబ్బంది, జీవీఎంసీ సిబ్బంది చూసీచూడనట్లు వ్యవహరించడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే వర్షాలు కురిస్తే పరిస్థితి ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఘనంగా ఫార్మసీ దినోత్సవం

ఆనందపురం : మండలంలోని మిందివానిపాలెంలో ఉన్న విశ్వనాథ ఫార్మా మెడికల్ కళాశాలలో బుధవారం జాతీయ ఫార్మసీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఫార్మసీ విద్య పితామహుడు ఎంఎల్ ష్రాఫ్ చిత్రపటానికి కళాశాల ప్రిన్సిపాల్ ఉమాదేవి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశంలో ఫార్మసీ విద్యను ప్రారంభించడానికి తీవ్ర కృషి చేశారని కొనియాడారు. అనంతరం ఉత్తమ విద్యార్థులకు మెమెంటోలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు సావిత్రి, నాగమణి తదితరులు పాల్గొన్నారు.